క్లుప్తంగా

'డబుల్' ఇళ్లలో వసతుల కల్పనకు నిధులు మంజూరు

భైంసాటౌన్: పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలుచోట్ల డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు రూ.5.94 కోట్లు మంజూరైనట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జి.విఠల్‌రెడ్డి తెలిపారు. ఇటీవల రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భైంసా వచ్చినప్పుడు కలెక్టర్, అధికార యంత్రాంగంతో మౌలిక వసతుల కల్పనపై అవసరమైన నిధుల కోసం సమీక్షించారని పేర్కొన్నారు. స్పందించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ, ఉపాధి సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: సేవాభారతి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యులు వివేక్ అన్నారు. శనివారం పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 18 నుంచి 35 ఏళ్లలోపు యువత అర్హులని.. ఎంపికైనవారికి నాలుగు నెలలపాటు జనరల్ డ్యూటీ అసిస్టెంట్, నర్సింగ్ అసిస్టెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, వసతితోపాటు ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ విద్యార్థి కదం పాండురంగ్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, ప్రిన్సిపాల్ సాయినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

భైంసాటౌన్: పట్టణంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విజన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ మోబిలైజర్ అనురాధ మాట్లాడుతూ బాల్యవివాహ చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100, తదితర అంశాలపై వివరించారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందిస్తున్న సమితి సభ్యులు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ పంచాయతీ పరిధిలోని గోండుగూడెంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 50 మంది నిరుపేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు సేవాసమితి సభ్యులు సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. ఇటీవల సేవాసమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల్లో కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు భీంసెన్, సభ్యులు రత్నాకర్‌రావు, బలస్తు రాజేశ్వర్, చిన్నం పెద్దులు, హరిచరణ్‌రెడ్డి, రామకృష్ణ, హైదర్, అర్జున్, సత్తయ్య ఉన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు చెప్పులు, సాక్స్, బూట్లు, లోదుస్తులు అందజేశారు. వారానికి రెండుసార్లు రాగి లడ్డూలు సైతం అందిస్తున్నామని ప్రిన్సిపాల్ స్వర్ణమంజుల పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇవ్వాలి'

నిర్మల్‌చైన్‌గేట్: సకాలంలో పన్నులు చెల్లించని వారికి చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు వసూలు చేసిన పన్నులు, బకాయి పన్నులకు సంబంధించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్ను వసూలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య, గృహ తదితర పన్నుల వసూలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య లైసెన్సులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేశ్‌కుమార్, మెప్మా పీడీ సుభాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన పోలీస్ బల'గ'ం


నూతన కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

- జిల్లాకు కొత్తగా 139 మంది పోలీసులు
- 103 మంది సివిల్, 36 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు
- పోస్టింగ్ ఇచ్చిన ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: జిల్లా పోలీసు బలగం, బలం మరింత పెరిగింది. కొత్తగా జిల్లాకు 139 మంది పోలీసులు వచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నవంబర్ 21 వరకు మహబూబ్‌నగర్, జడ్చర్ల, నల్గొండ జిల్లాలో పురుషులు శిక్షణ పూర్తి చేసుకున్నారు. మహిళలు హైదరాబాద్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందారు. జిల్లాకు వచ్చిన 139 మందిలో వీరిలో 67 మంది పురుషులు సివిల్, 36 మంది మహిళా సివిల్ కానిస్టేబుళ్లు ఉన్నారు. 36 ఏఆర్ కానిస్టేబుళ్లు 30 పురుషులు, ఆరుగురు మహిళలు ఏఆర్ కానిస్టేబుళ్లు వచ్చారు. సమాజానికి అత్యున్నతమైన సేవలు అందించే అవకాశం ఉన్న పోలీస్ శాఖలో చేరి, శిక్షణ పూర్తి చేసుకుని శనివారం నుంచి బాధ్యతలు చేపట్టారు. కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిలో చాలామంది ఉన్నత చదువులు చదివిన వారు ఉన్నారు. కొంతమంది పోలీస్ శాఖపై ఇష్టంతో, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగం దిశగా అడుగులు వేసినవారు ఉన్నారు. ఎస్పీ జానకీషర్మిల శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, వారికి పోస్టింగ్ ఇచ్చారు. ప్రజల రక్షణ , వారి హక్కులను కాపాడుతూ ఆత్మ గౌరవానికి భంగం కలగకుండా నడుచుకోవాలని సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన కొందరు కానిస్టేబుళ్లు సాక్షితో మాట్లాడారు.

ప్రణాళికతో సన్నద్ధమయ్యా..



మా నాన్న పోలీస్ శాఖలో ఏఎస్‌ఐగా పనిచేస్తున్నారు. నేను గురునానక్ కళాశాలలో ఇంజినీరింగ్(సివిల్) పూర్తి చేశా. సాఫ్ట్‌వేర్ రంగం వైపు అడుగులు వేసినా.. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం. దీంతో ప్రణాళికతో పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యా.

– గురుబక్‌సింగ్, ఆదిలాబాద్

పోలీస్ అంటే ప్యాషన్..



నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలనే ప్యాషన్ ఉంది. రెండుసార్లు ప్రయత్నం చేసి ఓడిపోయా. మూడోసారి పక్కాప్రణాళికతో ముందుకుసాగి విజయవంతమయ్యా. సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. మా నాన్న ఓ మెకానిక్. కుటుంబసభ్యులు ఆనందంగా ఉన్నారు. దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

– ఎ. క్రాంతి, సోన్

ఎస్సై కావాలన్నదే లక్ష్యం..



నేను రైతు కుటుంబం నుంచి వచ్చాను. మా అమ్మానాన్న వ్యవసాయం చేస్తుంటారు. నేను డిగ్రీ చదివే సమయంలో ఎన్‌సీసీలో చేరా. అప్పుడే నా మనసులో పోలీస్ కావాలనే ఆలోచన బలంగా నాటుకుపోయింది. ఎంసీఏ పీజీ పూర్తి చేశా. శారీరక, రాతపరీక్షలకు సన్నద్ధమై పోలీస్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. నాకు నిర్మల్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. యువత సమయం వృథా చేయొద్దు. భవిష్యత్తులో ఎస్సై కావాలన్నదే నా లక్ష్యం.

– సింధూజ, మాదాపూర్

అమ్మానాన్న ప్రోత్సాహంతో..



నేను పదోతరగతి చదువుతున్నప్పటి నుంచి మా అమ్మానాన్న ఎంతో ప్రోత్సహించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. డీఎడ్.. చదివి ప్రైవేట్ టీచర్‌గా పని చేశాను. టీచర్ జాబ్ కంటే.. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో.. పోలీసు కావాలని నిర్ణయించుకున్నాను. కష్టపడి చదివి చివరికి పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. నాకు సోన్ పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఇచ్చారు.

– వి.మనీషా, మాటేగాం, మం.భైంసా

ప్రజలతో మమేకం కావాలి



ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత. పోలీస్ అంటే ఏదో అధికారం కాదు. పోలీస్ గౌరవం పెంచేలా విధులు నిర్వహించాలి. ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకోవాలి. పోలీస్ ఉద్యోగంలో క్రమశిక్షణ ముఖ్యం. పని ఒత్తిడి, ప్రతికూల పరిస్థితుల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలి. అవినీతి, ప్రలోభాలకు దూరం ఉంటూ నిజాయతీగా విధులు నిర్వర్తిస్తే ప్రజలు తప్పక ఆదరిస్తారు.

– ఎస్పీ, జానకీ షర్మిల

వైభవంగా రైతుపండుగ

భైంసారూరల్: రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని చుచుంద్ గ్రామ రైతువేదికలో రైతుపండుగ కార్యక్రమం నిర్వహించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్‌ను అధికారులు, రైతులు వీక్షించారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ, సన్నాలకు బోనస్, రైతుబీమా తదితర పథకాలను రైతుల సంక్షేమం కోసం అందిస్తున్నట్లు వివరించారు. భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతుపండుగ కార్యక్రమంలో ఏవో వినోద్‌కుమార్, ఏఈఓలు జాదవ్ ఉమమహేశ్వరి, ప్రగతి, అశోక్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్, ఏఓ వాకర్ అహ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, నాయకులు బొల్లోజి నర్సయ్య, పాతారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఏఈఓలు అరుణ్, సుప్రియ, లక్ష్మి, ఉమేశ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, రాజేశ్వర్, ఏవో వసంత్‌రావు, ఏఈవో పవిత్ర, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో రైతుపండుగ నిర్వహించారు. ఖానాపూర్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ సుజాత, ఏవో జగదీశ్వర్, ఏఈవోలు రాకేశ్, రజిత, చందన ఉన్నారు.

ముధోల్: మండలకేంద్రంలో నిర్వహించిన రైతుపండుగలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గంగారెడ్డి, నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, కిషన్ పతంగే, రావుల శ్రీనివాస్, అజీజ్, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.


కుంటాల రైతువేదికలో సీఎం ప్రసంగం వీక్షిస్తున్న అధికారులు, రైతులు

లోకేశ్వరం: మండలకేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫిరెన్సుద్వార రైతులు శనివారం తిలకించారు.ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వ రైతులకు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.ఈకార్యక్రమంలో మండల రైతులు పాల్గొన్నారు.

కుంటాల: కుంటాల రైతువేదికలో నిర్వహించిన రైతుపండుగలో డీపీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం, భైంసా ఏడీఏ వీణ, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీంఖాన్, ఏఓ విక్రమ్, ఏఈఓలు గణేశ్, శ్రీనివాస్, హర్షిత, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిజామాబాద్‌రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రేఖానాయక్

ఖానాపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ అధిష్టానానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రాజూర విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపిక

లోకేశ్వరం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్మల్‌లోని సోఫీనగర్ టీజీఆర్ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలంలోని రాజూర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి జయేంద్ర ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థి డీఈవో రామారావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. విద్యార్థిని హెచ్‌ఎం రాజేశ్వర్, గైడ్ టీచర్ చంద్రశేఖర్ అభినందించారు.

ధాన్యం వివరాలను పొందుపర్చాలి

సోన్: తూకం వేసిన ధాన్యం వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని డీపీఎం రాజేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని న్యూబొప్పారంలో ధాన్యం కొలుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఐకెపి ఏపీఎం గంగామణి, సీసీ శ్రీనివాస్, సరిత, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అన్నదానం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని హరిహర క్షేత్రంలో ఈనెల 1 నుంచి జనవరి 13 వరకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వామి మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్‌రెడ్డి దంపతులు సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరం ఉండాలి

కడెం: మాదకద్రవ్యాలకు దూరం ఉండాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్సై దేవ్, నెహ్రూ యువ కేంద్రం సిబ్బంది షేక్ మజీద్, యువజన సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యాయులు వెంకటరమణ, శివకుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ మనందరి బాధ్యత

పెంబి: అడవిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని ఎఫ్ఎస్‌వో సుందర్ అన్నారు. శనివారం మండలంలోని పుల్గంపాండ్రిలో అటవీశాఖ అధికారులు అటవీ సంరక్షణ చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇందులో ఎఫ్‌బీవోలు కిరణ్, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు

తానూరు: సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్ సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులకు దూరం ఉండాలని.. అనుమానితులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగర్జన సభకు తరలిరావాలి

తానూరు: సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 1న నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండలాధ్యక్షులు అంబాదాస్ పవార్ సూచించారు. శనివారం మండలంలోని బెంబర, బోల్సా, ఉమ్రి(కే), బెల్‌తరోడా, మహలింగి, బామ్ని గ్రామాల్లో సింహగర్జన సభ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు భీమ్‌పవార్, నాగేశ్, ఆనంద్‌రావ్, గంగాధర్, దీపక్, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్‌లో వాగ్వాదం

భైంసాటౌన్: పట్టణంలోని ఓ పెట్రోల్‌పంపు వద్ద శనివారం సాయంత్రం వాగ్వాదం చోటు చేసుకుంది. మండలంలోని మిర్జాపూర్‌కు చెందిన ఏడ్కె సాయి అనే యువకుడు.. తన బైక్‌లో రూ.260 పెట్రోల్ పోయించుకోగా తక్కువ వచ్చిందనే అనుమానంతో సిబ్బందిని ప్రశ్నించాడు. ఈక్రమంలో సిబ్బందితో వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి ఇరువురిని సముదాయించారు. అనంతరం సిబ్బంది తనపై దాడి చేశారని బాధిత యువకుడు, తమపై యువకుడు దాడి చేశారని పెట్రోల్‌పంపు సిబ్బంది పరస్పరం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జ్ఞాపకాలు.. ఇక కనుమరుగు


పాతభవనం కూలుస్తున్న పొక్లెయిన్

కుంటాల: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో.. దాని స్థానంలో మనఊరు– మనబడి కింద రూ.1.53కోట్లు కేటాయించి నూతన భవనం నిర్మించారు. దీంతో శనివారం పాఠశాల పాత భవనాన్ని పొక్లెయిన్‌తో కూల్చివేశారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ భవనంలో చదివినవారు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

జగదీశ్ చంద్రబోస్‌కు నివాళి

భైంసారూరల్/భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో, భైంసా మండలం చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జగదీశ్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి, రాజేశ్వర్, పండరి, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం


నిర్మల్‌లోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

నిర్మల్‌రూరల్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజన విషయమై జరుగుతున్న ఘ టనలకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ జిల్లాలో విజయవంతమైంది. నాయకులు మాట్లాడుతూ సీఎం విద్యాశాఖను తన దగ్గర పెట్టుకుని విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు కిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దిగంబర్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

సాక్షి స్పందన


బాసరలో పరిశీలిస్తున్న అధికారులు

బాసర: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులను తహసీల్దార్ పవన్ చంద్ర ఆదేశించారు. మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకొచ్చిన రైతులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 30న సాక్షిలో తూకం వేస్తలేరు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. శనివారం మండలంలోని బాసర, కిర్గుల్(బి), కిర్గుల్(కె) గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పవన్‌చంద్ర, సిబ్బంది సందర్శించారు. ఈసందర్భంగా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక సంచిలో 42 కిలోల ధాన్యాన్ని అదనంగా తూకం వేస్తున్నారని రైతులు.. రెవెన్యూ అధికారులకు వివరించారు. ఆర్ఐ అభిమన్యు, డీటీ రాము తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం


ఖానాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యులు పట్టణంలోని పలు అభివృద్ధి విషయాలపై చర్చించి తీర్మాణాలు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహణ ఖర్చులకు వ్యయంతోపాటు మున్సిపల్ సిబ్బందికి ఐడీ కార్డుల జారీ, స్వశక్తి మహిళ సమాఖ్య ద్వారా అందించే సేవలు, కోతుల బెడద, పారిశుద్ధ్య పనులపై చర్చించి తీర్మానం చేశారు. వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు సంకీర్తన, జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమిలత, ఆఫ్రినా బేగం, కిశోర్‌నాయక్, అబ్దుల్ కలీల్, ఫౌజియాబేగం, కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల నిరసన

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు పనులు నిలిపివేయడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద పలువురు కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. గతంలో పాలకవర్గం చేసిన తీర్మానానికి కట్టుబడి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్, పలువురు సిబ్బంది విగ్రహం ఏర్పాటు పనులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కౌన్సిలర్లు అబ్దుల్ కలీల్, ఆఫ్రినాబేగంఅమానుల్లఖాన్, కారింగుల సంకీర్తన, ఫౌజియాబేగం షబ్బీర్ పాషా సమావేశాన్ని వాకౌట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా విగ్రహం ఏర్పాటు సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు
- ట్రస్మా ఆధ్వర్యంలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రస్మా) ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2024 నిర్వహించారు. శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, ఇతర అథెటిక్స్ పోటీలు నిర్వహించారు. అంతకుముందు విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గంగన్న, ట్రెజరర్ వినోద్, పట్టణ అధ్యక్షుడు చంద్రగౌడ్, ప్రైవేటు పాఠశాలల యజమానులు మంచిరాల నాగభూషణం, ప్రమోద్‌రావ్, సాయన్నయాదవ్, పోతా రెడ్డి, ప్రభుత్వ పాఠశాలల పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి


కడెం : పల్లిపట్టీ తయారీ కేంద్రం వద్ద ఈశ్వరీబాయి, మహిళలు

కడెం: మహిళలు స్వయంఉపాధి పొంది ఆర్థికప్రగతి సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. శనివారం మండలంలోని కొలాంగూడలో ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్‌తో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో నీటి సౌకర్యం, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన కోఆపరేటివ్ సొసైటీ సహకారంతో త్వరలో ప్రారంభం కానున్న పల్లిపట్టీ తయారీ (చిక్కి)కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా పల్లీపట్టి తయారీ విధానాన్ని స్థానిక మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల మంజూరు చేసేలా ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ జేడీఎం నాగభూషణం, ఐటీడీఏ సూపర్‌వైజర్ గంగాధర్ తదితరులున్నారు.

పెంబి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని ఈశ్వరీబాయి అన్నారు. శనివారం మండలంలోని షెట్‌పల్లి (కోలంగూడ), గుమ్మెన గ్రామాలను పీవీజీటీ ఏపీవో మనోహర్‌తో కలిసి సందర్శించారు. పులాజీ బాబా కేంద్రం పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు ఆమెకు వినతిపత్రం అందజేశారు.

ధాన్యం తూకంలో కోతలు అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్:ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో కోతలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొమ్మెన సురేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఖానాపూర్ ఏరియా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ప్రతి బస్తాకు కేజీన్నర ధాన్యాన్ని అదనంగా కోత విధించడాన్ని సీపీఎం పార్టీ ఖండిస్తుందన్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షించి రైతులు మోసపోకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దుర్గం నూతన్‌కుమార్, తిరుపతి, నాగెల్లి నర్సయ్య, రజిత, రాధ, చుంచుల నారాయణ, పొనగంటి నరేశ్, రాజేశ్, నీరజ తదితరులు ఉన్నారు.

పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

కడెం: గ్రామపంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దబెల్లాల్‌లో మాట్లాడారు. పంప్రత్యేక బడ్జెట్ కేటాయించి వారికి ప్రతినెల జీతాలు అందించాలని కోరారు. తక్షణం మూడు నెలల పెండింగ్ వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాధ, రాములు, నవీన్, సాంబయ్య, భూమయ్య, అశోక్ ఉన్నారు.

దొడ్డురకాలకు బోనస్ ఇవ్వాలి

లోకేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకాలకు బోనస్ ఇవ్వాలని సీపీఎం ముధోల్ ఏరియా ప్రతినిధి ముత్తన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పుస్పూర్ గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ముధోల్ ఏరియా ప్రతినిధి బృందం సభ్యులు పరిశీలించారు. వారి వెంట సభ్యులు పోశెట్టి, ప్రసాద్, పోతన్న, రాజు ఉన్నారు.